క్లుప్తంగా

చురుగ్గా శివాలయం పునర్నిర్మాణ పనులు

యడ్లపాడు: మండలంలోని వంకాయలపాడు గ్రామంలో వేంచేసి యున్న శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సుమారు 200 ఏళ్ల నాటి ఈ ఆలయం పూర్తిగా జీర్ణావస్థకు చేరడంతో గ్రామపెద్దలు సమిష్టిగా పునరినిర్మాణ పనులకు పూనుకున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో పురాతన ఆలయాన్ని తొలగించారు. తిరిగి కార్తీకమాసంలో డిశంబర్ 8న నూతన ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి భూమిపూజ చేశారు. ఈ నేపథ్యంలో ఆలయ పునాది పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సుమారు రూ.కోటి నిధుల అంచనాతో రూపొందించే ఆలయ నిర్మాణ పనులకు భక్తులుతమవంతు సహాయ సహకారాలను అందించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

శంకరేశ్వరుని ఆలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో వేంచేసి యున్న శ్రీ శంకరేశ్వర స్వామి ఆలయ 5వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. స్వామి వార్లు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ నిర్వహించారు.

బాలోత్సవంలో విద్యార్థుల ప్రతిభ



శావల్యాపురం: గుంటూరులో జరుగుతున్న బాలోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆదివారం రెండో రోజు జరిగిన పోటీల్లో మూడు బహుమతులు సాధించినట్లు గైడు టీచరు జె.శ్రీనివాసరావు తెలిపారు. జానపద నృత్యం సీనియర్ విభాగంలో ప్రథమ స్థానం, మ్యాప్ పాయింటింగ్‌లో ద్వితీయ స్థానం, కోలాటంలో కన్సోలేషన్ బహుమతులు సాధించినట్లు చెప్పారు. విజేలకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు.

వడ్డెర యువగర్జన సభ విజయవంతానికి పిలుపు



నరసరావుపేట: రాష్ట్రంలోని వడ్డెర కులస్తులను రాజకీయ పరంగా గుర్తించేందుకు ఈ నెల 25న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వడ్డెర యువ గర్జన మహాసభను ఏర్పాటు చేసినట్లు వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు దేవళ్ల వెంకట్ తెలిపారు. స్థానిక పల్నాడు రోడ్డులోని వడియరాజుల కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని వడ్డెర నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలోని 40 లక్షల ఓటు హక్కును కలిగిన వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చి అన్ని రాజకీయ పార్టీలు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా అవకాశం ఇవ్వాలని కోరారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తన్నీరు సాంబయ్య మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా వడ్డెర కుల బలాన్ని తెలిపేందుకు నిర్వహించ తలపెట్టిన ఈ సభకు వడ్డెర కులస్తులంతా పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థుల్లో దాగిన సృజనను వెలికితీయాలి



యడ్లపాడు: విద్యార్థులను విభిన్న రంగాల్లో తీర్చిదిద్దుతూ పాఠశాలతో పాటు గ్రామానికి ఖ్యాతి తెస్తున్న ఉపాధ్యాయులకు కొండవీడు గ్రామస్తులంతా రుణపడి ఉంటారని గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్ మొహమ్మద్ యూనీస్ అన్నారు. మండలంలోని కొండవీడు గ్రామంలోని పీఎంశ్రీ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో భారతీయ కళలు, సృజనాత్మకత విభాగాల్లో అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. ముంబయికి చెందిన స్వచ్ఛంద సంస్థ రంగోత్సవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 36 మంది విద్యార్థులు హాజరై 9 విభాగాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు విద్యార్థులను సంసిద్ధుల్ని చేసిన పాఠశాల హెచ్ఎం గోరంట్ల శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

వైద్యరంగం పటిష్టతకు ప్రత్యేక చర్యలు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- పల్నాడు జిల్లా కెమిస్టు అండ్ డ్రగిస్టు అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నరసరావుపేట: ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున వైద్యులు, వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టి వైద్యరంగాన్ని పటిష్టం చేశారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భువనచంద్ర టౌన్‌హాలులో పల్నాడు జిల్లా కెమిస్టు అండ్ డ్రగిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు కేపీ రంగారావు అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంతో పాటు నూతన కార్యవర్గ ఎన్నికకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లింగంగుంట్ల 200 పడకల వైద్యశాలలో 35 మంది వైద్యులు పనిచేస్తున్నారని చెప్పారు. వైద్య రంగంలో సీఎం జగన్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. దేశంలో ప్రభుత్వ రంగంలో 69 శాతం వైద్యుల ఖాళీలు ఉండగా, సీఎం జగన్ తీసుకున్న చర్యలతో రాష్ట్రంలో కేవలం నాలుగు శాతం మాత్రమే ఖాళీలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టగా పిడుగురాళ్లలో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తికావొచ్చిందన్నారు. కెమిస్టు అండ్ డ్రగిస్టు నూతన కార్యాలయం కోసం కలెక్టరేట్ సమీపంలో ఐదు సెంట్ల స్థలం కేటాయింపు చేసి రూ.1.5 కోట్లతో నిర్మించే భవన సముదాయానికి శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. మరో ఆరు నెలల వ్యవధిలో పూర్తి చేసి ప్రారంభించడం జరుగుతుందన్నారు. కెమిస్టుల సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. కోవిడ్ సమయంలో వీరిపాత్ర మరువలేనిదన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడే మందుల విషయంలో నాణ్యతను పాటిస్తూ నిజాయతీగా విక్రయించాలని సూచించారు.

నూతన అధ్యక్షుడిగా వేణుమాధవ్

పల్నాడు జిల్లా కెమిస్టు అండ్ డ్రగిస్టు అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్షుడిగా నరసరావుపేటకు చెందిన ఎంవీ వేణుమాధవరావు, సెక్రటరీగా సత్తెనపల్లికి చెందిన ఆర్‌వీ మల్లికార్జునరావు, కోశాధికారిగా చిలకలూరిపేటకు చెందిన కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఎన్నిక అధికారులుగా కె.నాగేశ్వరరావు, శివన్నారాయణ, జగదీశ్వరరావు, పరిశీలకులుగా బాలు (మార్కాపురం) భాస్కరరావు (నెల్లూరు), శ్రీహరి (విజయవాడ) వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షులు పీవీ రత్నం, ఫౌండర్ అధ్యక్షుడు డి.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి టీవీ సుబ్రమణ్యం, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కెమిస్టు, డ్రగిస్టులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌సీ, సీఏఏ చట్టాలతో ప్రజలకు ఇబ్బందులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఐఎం నాయకుడు మస్తాన్‌వలి

నరసరావుపేట: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ఎన్‌ఆర్‌సీ, సీఏఏ చట్టాల వలన దేశంలోని ఒక్క ముస్లింలే కాకుండా భారతీయులకు సైతం ఇబ్బందిగా మారుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఎన్‌ఆర్‌సీ, సీఏఏ చట్టాలకు వ్యతిరేకంగా స్టేషన్‌రోడ్డులోని విజయ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఎంఐఎం కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహమ్మద్ సమి మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు ఎలాంటి ఆధార్, రేషన్ కార్డులు లేకుండా అనేకమంది జీవిస్తున్నారని పేర్కొన్నారు. ముస్లింలతో పాటు వివిధ కుల,మతాల వారు ఉన్నారన్నారు. ఎంఐఎం, జై బీమ్ భారత్, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్, మాలమహానాడు, ముస్లిం, బీసీ, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమించేందుకు మోటివేషన్ క్లాసులు



ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధుల నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న రాధిక

నరసరావుపేట ఈస్ట్: పట్టణానికి చెందిన వాసవి క్లబ్ వనిత అధ్యక్షురాలు మునగాల రాధిక ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ట్రైన్ ది ట్రైనర్ కోర్సు పూర్తి చేసారు. ఈ మేరకు ఇంపాక్ట్ ఫౌండేషన్ ఛైర్మన్ గంపా నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆదినారాయణరెడ్డి చేతుల మీదుగా సికింద్రాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫైడ్ ట్రైనర్ సర్టిఫికెట్ అందుకున్నట్టు రాధిక ఆదివారం తెలిపారు. కోర్సులో భాగంగా 24రోజులు ఆన్‌లైన్ క్లాసులు, రెండు రోజులు ఆఫ్‌లైన్ తరగతులకు హాజరైనట్టు తెలిపారు. విద్యార్థులకు స్టడీ స్కిల్స్, సమయపాలన, తల్లిదండ్రులు, గురువుల పట్ల ప్రవర్తన, పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు వారిలో మానసిన స్థైర్యాన్ని నింపేందుకు తన శిక్షణ ఉపయోగపడుతుందని వివరించారు. విద్యార్థులు వొత్తిడిని అధిగమించేందుకు అవసరమైన మనో నిబ్బరాన్ని పొందేందుకు ఈ క్లాసులు ఉపయోగపడతాయని తెలిపారు. పరీక్షలు సమీపిస్తుండటంతో పాఠశాలల వారీగా మోటివేషన్ క్లాసులు నిర్వహించనున్నట్టు వివరించారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా మారండి

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



రక్తదాన శిబిరంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట: రక్తదానం చేయడంతో పాటు సమాజంలో రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించటానికి దిల్‌సే ఫౌండేషన్ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎంఎస్ గార్డెన్స్‌లో దిల్‌సే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీపీటీ బ్లడ్‌బ్యాంక్ సౌజన్యంతో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ రక్తదానం చేసేలా యువతను ప్రోత్సహిస్తున్న తీరు ఆదర్శనీయమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ రక్తదాతగా మారి అత్యవసర సమయంలో రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా మారవచ్చన్నారు. శిబిరంలో 120 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో దిల్‌సే ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ ఖాజాహసన్, షేక్ వలి, షేక్ హామద్, షేక్ లియాఖత్, దుర్గానాయక్ తదితరులు ఉన్నారు.

బాల్యమిత్రుడిని కలిసిన సినీ హాస్యనటుడు బ్రహ్మానందం



సత్తెనపల్లిలో తన బాల్య మిత్రుడు నందా సాంబశివరావు, కుటుంబ సభ్యులతో సినీ హాస్యనటుడు బ్రహ్మానందం

సత్తెనపల్లి: ప్రముఖ సినీ హాస్యనటుడు బ్రహ్మానందం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని బాల్య మిత్రుడు ఇంటిని ఆదివారం సందర్శించారు. పట్టణంలో స్టాంప్ వెండర్‌గా పనిచేస్తున్న నందా సాంబశివరావు అనారోగ్యంగా ఉండటంతో ఎప్పటి నుంచో ఆయనను కలవాలని బ్రహ్మానందం భావిస్తున్నప్పటికీ సాధ్యపడటం లేదు. ఈ క్రమంలో ఆదివారం గుంటూరులోని ఓ కళాశాలలో జరిగే ప్రోగ్రాంలో పాల్గొనేందుకు వెళుతూ మార్గమధ్యలో సత్తెనపల్లిలో తన బాల్యమిత్రుడు నందా సాంబశివరావును కలుస్తానని బాల్యమిత్రులైన సీనియర్ జర్నలిస్ట్ మారూరి పుల్లారెడ్డి, ప్రముఖ చిత్రకారుడు జింకా రామారావులకు సమాచారం అందించారు. వారిరువురు కూడా నందా సాంబశివరావు ఇంటి వద్ద వేచి ఉండగా బ్రహ్మానందం అక్కడకు చేరుకొని నందా సాంబశివరావు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సాంబశివరావు కుటుంబ సభ్యులతో ఫొటో దిగారు. ముందుగా వడ్డవల్లిలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో పూజారిగా పని చేస్తున్న తన సోదరుడు శ్రీనివాసరావును కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. స్వామి వారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా సినీ హాస్యనటుడు బ్రహ్మానందం సత్తెనపల్లి వచ్చాడని తెలియడంతో చూసేందుకు అభిమానులు ఆసక్తి కనబరిచారు. ఆయన వెంటనే గుంటూరు బయలుదేరి వెళ్లారు.

ఉపాధి కూలీలకు వంద పనిదినాలు కల్పించాలి

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు తప్పనిసరిగా వంద పనిదినాలు కల్పించాలని ఏపీవో కోటమ్మ తెలిపారు. ఆదివారం వివిధ గ్రామాల ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామాలలో ఉన్న ఉపాధి కూలీలకు జాబ్‌కార్డులో 50 నుంచి 99 రోజులు పనిదినాలు కల్పించిన వారు అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. వారికి తప్పనిసరిగా వంద పనిదినాలు కల్పించే దిశగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో పనులు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ ఏసు బాటలో నడవాలి

విజయపురిసౌత్: ప్రతి ఒక్కరూ దేవునిపై విశ్వాసంతో జీవించాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఉద్బోధించారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో జరిగిన దివ్య బలిపూజ కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. తోటివారిని ప్రేమించటం క్రైస్తవంలో ప్రధానమన్నారు. ఏసుక్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఏసు ప్రభువును ఈ ప్రపంచానికి అందించిన దివ్యమూర్తి మేరిమాత అని కొనియాడారు. దీనికి ముందు పలువురు భక్తులు దేవాలయంలో తలనీలాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా పట్టణం లోని పలు ప్రాంతాలలో సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పురుషోత్తమ పట్నం, అడ్డరోడ్డు సెంటర్, కేబీ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో వేంచేసి యున్న గ్రామ దేవతలు పోలేరమ్మ, అద్దంకమ్మ, కనకమ్మ అమ్మవార్ల కొలుపుల వేడుకలను ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా ఐక్యంగా పార్టీలకు అతీతంగా భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో కుంకుమ బండ్లు ఊరేగింపును మేళతాళాల నడుమ వైభవంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించారు. పొంగళ్లు పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన ఉయ్యాల రామకోటయ్య పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాదంలో ఇంట్లో ఉన్న గృహోపకరణాలతో పాటు రూ.1 లక్ష విలువైన నగదు బుగ్గిపాలైంది. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేరు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక అధికారులు శకటంతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఈపూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రంగనాయకులు తెలిపారు. మండల అధ్యక్షురాలు ఈదర రాధిక అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై చర్చించడం జరుగుతుందని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

వీరమాచినేటి సేవలు మరువలేనివి

మాచర్ల: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విశేష సేవలందించిన స్వర్గీయ వీరమాచినేటి సుభాష్‌చంద్రబోస్ చేసిన సేవలు మరువలేనివని రొటేరియన్ డాక్టర్ రామకోటయ్య, తుమ్మల సత్యప్రసాద్, పఠాన్ నాగూర్‌వలి నివాళులర్పించారు. వీరమాచినేటి ఐదవ వర్ధంతిని పురస్కరించుకుని 50 మంది పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అదే విధంగా పట్టణంలోని వివేకానంద అనాథాశ్రమానికి ఇన్వెర్టర్, బ్యాటరీలను అందించడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది చంద్రబోస్ పేరు మీద సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు రోటరీ క్లబ్ ఫౌండేషన్‌కు రూ.3 లక్షలు విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కె.శంకరరావు, ఎల్.వెంకటేశ్వర్లు, ఇక్కుర్తి శంకర్, డాక్టర్ శ్రీకాంత్, చెరుకూరి నరసింహారావు, కర్నాటి వాసు, షేక్ మస్తాన్‌వలి, మేడమ్ నాగేశ్వరరావు, అన్నపరెడ్డి నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

22 నుంచి జగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో వేంచేసియున్న సుభద్ర బలభద్ర సహిత జగన్నాథ స్వామి వారి పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలు 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 22వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంతో ప్రారంభమై 26వ తేదీన ముగుస్తాయన్నారు. ముగింపు రోజున స్వామి వారి కళ్యాణోత్సవం, కుంభాభిషేకం జరుగుతుందన్నారు. పరిసర గ్రామాల ప్రజలు స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

23న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యల కల్యాణ మహోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని నరసరావుపేట రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో ఈనెల 23న ఉదయం 11:51 గంటలకు శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి, కాకాని గోపయ్య స్వామిల 30వ వార్షిక కళ్యాణ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు.

జన్మభూమికి సేవ చేయడం దేవుడిచ్చిన వరం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- స్వగ్రామం వేల్పూరులో రూ.కోటి వ్యయంతో ఇంటింటి తాగునీటి కొళాయిల ప్రారంభోత్సవం

శావల్యాపురం: జన్మభూమి రుణం తీర్చుకోవడం దేవుడిచ్చిన వరమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే స్వగ్రామమైన మండలంలోని వేల్పూరు గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం నిధులు రూ.కోటి వ్యయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఇంటింటికీ నీటి కొళాయిలు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వేల్పూరు గ్రామ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా గ్రామస్తుల సహకారంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలోని కొందరు టీడీపీ నాయకులు సోషల్ మీడియాలో ఇష్టానుసారం తనపై అసభ్యకరంగా పోస్టులు పెట్టడంతో పాటు అనుచిత వ్యాఖ్యలు చేయటంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇటీవల ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ మద్దతుదారులు వైఎస్సార్‌సీపీలోకి వారి ఇష్ట పూర్వకంగా చేరితే వారిని బెదిరించటం మంచి పద్ధతి కాదన్నారు. అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా పోటీ పడాలని సూచించారు. టీడీపీ నాయకుల బెదిరింపులకు భయపడే వ్యక్తిని తాను కాదన్నారు. బడుగు బలహీన వర్గాల వారందరికీ అండగా ఉంటానన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు రూ.30 కోట్ల మేర అభివృద్ధి పనులు చేశామన్నారు. జీర్ణావస్థకు చేరిన చెన్నకేశవస్వామి, గంగమ్మ తల్లి దేవాలయాల పునర్నిర్మాణ పనుల్లో తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. అనంతరం గంగమ్మ తల్లి దేవాలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించి కమిటీ సభ్యులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీర్నేడి రత్నగిరి, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఈపూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు నాగులపాటి చెన్నయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు తూమాటి కబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముండ్రు రాఘవరావు, గట్టుపల్లి వీరాస్వామి, ఆలపాటి శ్రీనివాసరావు, పొత్తూరి వెంకట పూర్ణచంద్రరావు, మాజీ ఎంపీపీ గుత్తా కోటేశ్వరరావు, ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూఢావత్ ఆకాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

శావల్యాపురం: ప్రజా సమస్యలు పరిష్కరించటంలో ప్రజా ప్రతినిధులు కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఆదివారం శావల్యాపురం వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రూ.43 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన గోదాం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలన్నీ నిల్వ ఉంచేందుకు ఈ గోదాంలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పొట్లూరు గ్రామంలో రూ. 50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేశామన్నారు. మరో రూ.50 లక్షల వ్యయంతో కల్యాణ మండపం నిర్మాణ పనులకు తమ వంతు సహకారం అందించామన్నారు. తాము చేసిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ప్రభుత్వంపై ఇష్టానుసారంగా నిందారోపణలు చేయటం పరిపాటిగా మారిందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీని ప్రజలంతా కలిసి భూస్థాపితం చేయటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోపూరి జ్యోతి, వైస్ ఎంపీపీ నంబూరి ప్రభావతి, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఈపూరు మార్కెటు యార్డు ఛైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ గుత్తా కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, సొసైటీ ఛైర్మన్లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా వెంకట శివసాంబశివరావు, డైరెక్టరు ఒంగోలు హనుమంతరావు, జిల్లా జీడీసీసీ బ్యాంకు డైరెక్టరు గోవింద్‌నాయక్, కావూరి మాబు సుభానయ్య, కొణతం ఏరుకలరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, పెద మదార్, సొసైటీ సీఈవోలు జాలాది నాగప్రసాదు, వైవి నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



పొట్లూరులో గోదాం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెదకూరపాడులో 159, 160, 161, 162, 163, 164, 169 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సౌకర్యాలను పరిశీలించారు. ఓటింగ్‌కు వచ్చే ప్రతి ఓటరుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వారి వెంట బీఎల్‌వోలు ఉన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



సత్తెమ్మ తల్లిని దర్శించుకుంటున్న సత్తెనపల్లి మున్సిపల్ చైర్మన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, సాంబశివరావు

అచ్చంపేట: సత్తెనపల్లి మున్సిపల్ చైర్మన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, వారి భర్త సాంబశివరావు మరో 300 మంది ఆత్మీయులతో ఆదివారం మాదిపాడు పంచాయతీ పరిధిలో స్వయం భూ సత్తెమ్మతల్లిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ సత్తెమ్మతల్లి నమ్మినవారికి కొంగుబంగారమని తెలిపారు. దేవస్థాన కమిటీ చైర్మన్ కొరివి వెంకట నరేష్, ఆర్య వైశ్య సంఘ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి దేవరశెట్టి శ్రీనివాసరావు వారికి ఘన స్వాతగం పలికారు.



